## క్లుప్తంగా

### వ్యక్తి అనుమానాస్పద మృతి


భద్రం మృతదేహం

కాకినాడ రూరల్: మండలంలోని తిమ్మాపురంలో పిఠాపురం రోడ్డును ఆనుకుని బస్ షెల్టర్ వద్ద ఆదివారం ఓ వ్యక్తి అనుమానాస్పద పరిస్థితుల్లో మరణించాడు. అతడు కాకినాడ జగన్నాథపురానికి చెందిన లక్కోజి భద్రం(34)గా గుర్తించారు. తిమ్మాపురం పోలీసుల వివరాల ప్రకారం, మద్యానికి అలవాటు పడిన భద్రం అనారోగ్యంతో బాధపడుతూ ఇంటికి దూరంగా ఉంటున్నాడు. తిమ్మాపురంలో అతడు ఉన్నట్టు బంధువులకు తెలిసింది. వారు ఆదివారం అక్కడకు వెళ్లి చూసేసరికి భద్రం చనిపోయి ఉన్నాడు. మృతుడి భార్య రాణి ఫిర్యాదు మేరకు ఎస్సై రవీంద్రబాబు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

### యూటీఎఫ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం


శిబిరాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్

కాకినాడ సిటీ: యూటీఎఫ్ స్వర్ణోత్సవాల సందర్భంగా ఆదివారం స్థానిక కచేరిపేటలోని సంఘ జిల్లా కార్యాలయంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కలెక్టర్ షాన్ మోహన్ ఈ శిబిరాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటరావు, ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు రక్తదాతలను అభినందించారు. సమస్యల సాధనలో ముందుండే యూటీఎఫ్, కార్యకర్తల సేవల్లో కూడా ముందుండడం ఆనందదాయకమన్నారు. డీఈఓ రమేష్ మాట్లాడుతూ విద్యా సంబంధిత విషయాల్లోనే కాకుండా, సామాజిక సేవా కార్యక్రమాల్లో యూటీఎఫ్ ఉపాధ్యాయుల పాత్ర అభినందనీయమన్నారు. జీజీహెచ్ బ్లడ్ బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ శారద, రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్ ఇన్‌ఛార్జి శివప్రసాద్ మాట్లాడుతూ ఒకరి రక్తదానం ముగ్గురి ప్రాణాలు కాపాడుతుందన్నారు. ఈ శిబిరంలో 62 మంది రక్తదానం చేశారు. సంఘ నాయకులు కేవీవీ నగేష్, టి.రవిచక్రవర్తి, టి.అన్నారాము, జి.ప్రభాకరవర్మ, ఎంవీ సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

### సాయిబాబా ఆలయ వార్షికోత్సవం


శిబిరంలో నేత్ర పరీక్షలు చేస్తున్న వైద్యులు

కాకినాడ సిటీ: కాకినాడ రూరల్ మండలం తూరంగి సాయిబాబా ఆలయం 29వ వార్షికోత్సవం సందర్భంగా ఆలయ ధర్మకర్త నల్లమిల్లి విశ్వనాథరెడ్డి పేదలకు ఉచిత దంత, నేత్ర శిబిరాలను ఆదివారం నిర్వహించారు. ఆలయం నిర్మించినప్పటి నుంచి అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు ధర్మకర్త విశ్వనాథరెడ్డి తెలిపారు.ఏటా పేదలకు వస్త్రదానం, అన్నదాన కార్యక్రమాలతో పాటు, ప్రతి వారం అన్న ప్రసాద వితరణ కార్యక్రమాలు చేస్తున్నట్టు వివరించారు. ఆలయ వార్షికోత్సవం సందర్భంగా అరుణ నేత్రాలయ ఆధ్వర్యంలో ఉచిత నేత్ర, దంత వైద్య శిబిరం నిర్వహించామన్నారు. పలువురు భక్తులు, పేదలు పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పారుపల్లి లక్ష్మణరావు, కిషోర్, కుమార్, రమా పాల్గొన్నారు.

### శ్వేతార్క గణపతికి ప్రత్యేక పూజలు


హోమం నిర్వహిస్తున్న వేద పండితులు

కరప: అన్నవరం దేవస్థాన పాలకవర్గం మాజీ సభ్యుడు చాగంటి సూరిబాబు స్వగృహంలో శ్వేతార్క(తెల్ల జిల్లేడు) గణపతి నాలుగో వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం భక్తి,శ్రద్ధలతో పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. వేద పండితుడు గంగాధరభట్ల సూర్యనారాయణమూర్తి(కుమారప్రియం) బృందంతో కలిసి చాగంటి సూరిబాబు శ్వేతార్క గణపతి స్వామివార్కి 101 గణపతి ఉపనిషత్తు పారాయణ, 104 చతురావృత తర్పణాలు, 101 శ్రీషోక్త పురుషోక్త పారాయణ, మహాన్యాసపూర్వక సింధూర ఏకాదశ రుద్రాభిషేకం, మూల మంత్ర విశేష హోమం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ముమ్మిడివరం, కొత్తపేట ఎమ్మెల్యేలు దాట్ల బుచ్చిబాబు, బండారు సత్యానందరావు దంపతులు, పలువురు ప్రముఖులు శ్వేతార్క గణపతిని దర్శించుకున్నారు.

# చదువుకొనాలంతే..!?

సమాజాభివృద్ధి విద్యతోనే సాధ్యమన్నది ప్రాపంచిక సత్యం. పాఠశాల స్థాయిలోనే చదువు సజావుగా సాగితే, విద్యార్థులు ఉన్నతంగా ఎదగడానికి ఆస్కారం ఉంటుంది. గత ప్రభుత్వం విద్యకు అత్యధిక ప్రాధాన్యమిచ్చి.. సర్కారు బడులతో పాటు, విద్యార్థులకు కావాల్సిన సదుపాయాలన్నీ సమృద్ధిగా కల్పించింది. కార్పొరేట్ స్థాయిలో విద్యా ప్రమాణాలు మెరుగుపర్చింది. తాజా ప్రభుత్వం వీటన్నింటినీ పక్కనపెట్టేసిందన్న విమర్శలు జోరుగా వినిపిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పాటై రెండు మాసాలు గడిచినా.. ఇంకా పాఠశాలల్లో స్టూడెంట్ కిట్లంటూ విద్యార్థులకు అరకొర వస్తువులు పంచుతుండడం.. ఆయా విమర్శలకు అద్దం పడుతోంది. విద్యా రంగ పథకాలను ముున్ముందు ఏం చేస్తుందోనన్న అనుమానాలు ప్రజానీకాన్ని పట్టి పీడిస్తున్నాయి.

- పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత
- నాణ్యత లేని మధ్యాహ్న భోజనం
- ఇంకా పూర్తి కాని స్టూడెంట్ కిట్ల పంపిణీ
- గాలిలో దీపంలా ప్రభుత్వ విద్యా వ్యవస్థ

కాకినాడ రూరల్ మండలం పాఠశాలల వివరాలు

| | |
|---|---|
| మొత్తం పాఠశాలలు | 77 |
| ప్రాథమిక పాఠశాలలు | 58 |
| ప్రాథమికోన్నత పాఠశాలలు | 4 |
| ఉన్నత పాఠశాలలు | 8 |
| బాలికల గురుకుల పాఠశాల | 1 |
| విద్యార్థుల సంఖ్య | 8,780 |
| ఉపాధ్యాయ పోస్టులు | 196 |
| ప్రస్తుతం ఉన్న ఉపాధ్యాయులు | 182 |
| ఖాళీలు | 14 |
| సింగిల్ ఉపాధ్యాయులస్కూళ్లు | 10 |
| స్టూడెంట్ కిట్లు మొత్తం కావల్సినవి | 8,780 |
| ఇప్పటికి వచ్చినవి | 8432 |
| ఇంకా అందాల్సినవి | 348 |


కాకినాడ రూరల్ మండలం రమణయ్యపేట కొత్తూరు ప్రాథమిక పాఠశాలలో ఒక గదిలో 4, 5 తరగతుల విద్యార్థులు


కరప నక్కావారి ఎస్సీవీధిలోని ఎంపీపీ స్కూలులో ఒకే గదిలో కూర్చున్న 1, 2, 3 క్లాసుల విద్యార్థులు

కాకినాడ రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియంతో పాటు, కార్పొరేట్ తరహాలో స్కూళ్లను తీర్చిదిద్దిన గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం విద్యను అనేక రకాలుగా ప్రోత్సహించింది. అమ్మ ఒడి పథకం ద్వారా తల్లులకు రూ.15 వేలు ఇచ్చి, వారిపై పిల్లల చదువు ఆర్థిక భారం కాకుండా చేసింది. రాష్ట్రంలో తాజాగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వారి విధానాలపై సర్వత్రా ఆతృత నెలకొంది. ప్రస్తుతం పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత నెలకొంది. ఉపాధ్యాయ పోస్టుల భర్తీతో పాటు, నాణ్యమైన మధ్యాహ్న భోజనం విద్యార్థులకు అందించాల్సి ఉంది. వేసవి సెలవుల అనంతరం విద్యా సంవత్సరం ప్రారంభమై రెండు నెలలవుతున్నా, విద్యార్థులకు పూర్తి స్థాయిలో స్టూడెంట్ కిట్లు (విద్యా కానుక) అందలేదు. ఇప్పటి వరకు వచ్చిన మేరకు కిట్లను పాఠశాలల్లో పంపిణీ చేయగా, ఇంకా చాలా రావాల్సి ఉంది. ప్రస్తుత ప్రభుత్వ వైఖరి చూస్తుంటే, మున్ముందు విద్యార్థులు ప్రైవేట్ స్కూళ్లకు మారిపోయే పరిస్థితులు లేకపోలేదు. కాకినాడ రూరల్, సిటీ నియోజకవర్గాల పరిధిలో ప్రభుత్వ పాఠశాలల స్థితిగతులిలా ఉన్నాయి.

**ఖాళీగా 29 పోస్టులు**

కరప మండలం: మొత్తం 51 ప్రాథమిక, 5 ప్రాథమికోన్నత, 9 ఉన్నత పాఠశాలలున్నాయి. ఈ పాఠశాలల్లో 304 మంది ఉపాధ్యాయులకు, 275 మంది మాత్రమే ఉన్నారు. మిగిలిన 29 పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

**అందరికీ అందని 'భోజనం'**

కాకినాడ సిటీ: అర్బన్ పరిధిలో 75 శాతం విద్యార్థులకు మాత్రమే మధ్యాహ్న భోజనం పరిమితమైంది. నగర వ్యాప్తంగా మున్సిపల్, జిల్లా, ప్రభుత్వ విభాగాల్లో 69 పాఠశాలలున్నాయి. వీటిలో 14,960 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరిలో కేవలం 75 శాతం మాత్రమే మధ్యాహ్న భోజనం సద్వినియోగం చేసుకుంటున్నారు. మెనూలో మార్పు ఏమీ ఉండడం లేదు. స్టూడెంట్ కిట్లు వంద శాతం పంపిణీ చేశారు. సబ్జెక్టు టీచర్లతో పాటు, ఎస్‌టీటీలతో కలిపి 75 వరకు పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

**ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలి**



పాఠశాలల్లో అరకొర వసతులతో విద్యాబోధన కుంటుపడుతోంది. ఉపాధ్యాయులు పూర్తి స్థాయిలో లేక పిల్లల చదువు అంతంత మాత్రంగానే ఉంది. మా హైస్కూలుకు హెచ్‌ఎం లేరు. ఇన్‌ఛార్జి హెచ్‌ఎం ఉన్నారు. ఇంగ్లిష్, పీఎస్ సబ్జెక్టులకు ఇద్దరు, ఎస్ఎస్, ఎన్ఎస్ సబ్జెక్టులకు ఒకొక్కటి వంతున ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అధికారులు స్పందించి ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలి.

– వట్టూరి భాగ్యప్రవీణ, విద్యార్థిని, పదో తరగతి, కరప హైస్కూలు

## శాకంబరి మాతగా అన్నపూర్ణా దేవి


శాకంబరి అలంకరణలో దర్శనమిచ్చిన అన్నపూర్ణాదేవి


టూటౌన్ వద్దనున్న నూకాలమ్మ అమ్మవారు

బోట్‌క్లబ్: ఆషాఢ మాసం సందర్భంగా ఆదివారం స్థానిక రామారావుపేటలోని అన్నపూర్ణా సమేత విశ్వేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు శాకంబరిగా భక్తులకు దర్శనమిచ్చారు. వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరలు, పండ్లతో అమ్మవారిని అలంకరించారు. భక్తుల ఆర్థిక సహకారంతో కూరగాయలతో ఆలయాన్నీ, ఆలయ పరిసరాలను తీర్చిదిద్దారు.

**నూకాలమ్మ అమ్మవారు**

స్థానిక టూటౌన్ సమీపంలోని కొత్తపేట నూకాలమ్మ అమ్మవారు భక్తులకు శాకంబరిగా దర్శనమిచ్చారు. అమ్మవారిని సుమారు ఐదు టన్నుల కూరగాయలు, ఆకుకూరలు, పండ్లతో అలంకరించారు. శాకంబరి అలంకరణలో ఉన్న అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అమ్మవారిని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు దర్శించుకున్నారు. భక్తులతో ఆలయం కిటకిటలాడింది. ఈఓ లక్ష్మణరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

## 'ఫ్రెండ్‌షిప్' సందడి

**40 ఏళ్ల తర్వాత కలిసిన పీఆర్ టెన్త్ బ్యాచ్**


సర్పవరం జంక్షన్‌లోని షాపింగ్ మాల్ వద్ద స్నేహితుల సందడి

కాకినాడ రూరల్: స్నేహితుల రోజు అంటే.. యువతలో ఎంతో క్రేజ్. ఆ రోజు కాస్తా ఆదివారం వచ్చిందంటే.. ఇక వారి ఆనందానికీ, ఉత్సాహానికీ హద్దే లేదు. అవధుల్లేని ఈ ఉత్సాహ కెరటం ఓ షాపింగ్ మాల్‌పై విరుచుకుపడింది. అంతే ఇంకేముంది. చిన్నా పెద్దా తేడా లేకుండా షాపింగ్ మాల్‌లో సందడి చేశారు. కాకినాడ సర్పవరం జంక్షన్ వద్ద నున్న ఓ షాపింగ్ మాల్‌కు వేలాదిగా ×స్నేహితులు× తరలివచ్చారు. అదే మాల్‌లో సరదాగా గడిపారు. ఐనాక్స్‌లో సినిమాలు చూసి సందడి చేసే వారు కొందరైతే.. రెస్టారెంట్లు, కేఫ్‌లలో కొందరు కాలక్షేపం చేశారు. యువత భారీగా తరలిరావడంతో ఆ మాల్ ఎదుట ట్రాఫిక్ స్తంభించింది.

**మొక్కల పంపిణీ**

స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మొక్కలు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన డాక్టరు అడ్డాల సత్యనారాయణ స్నేహ బంధం విలువలను వివరించారు. అనంతరం పలువురికి మొక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సభ్యులు చింతపల్లి సుబ్బారావు, అడబాల రత్నప్రసాద్ పాల్గొన్నారు.

**ఆత్మీయ అనుబంధం**

కాకినాడ రూరల్: స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకుని కాకినాడ పీఆర్ ప్రభుత్వ పాఠశాల పూర్వ విద్యార్థులు 40 ఏళ్ల తర్వాత ఆత్మీయ కలయికతో సందడి చేశారు. స్థానిక రమణయ్యపేటలోని కన్వెన్షన్ హాలులో పీఆర్ ప్రభుత్వ పాఠశాల 1983–84 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. దాదాపు నాలుగు దశాబ్దాల తర్వాత కలుసుకోవడంతో, ఒకరినొకరు గుర్తుపట్టలేకపోయారు. దీంతో వారందరూ ఒకరినొకరు పరిచయం చేసుకుని, పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. జీవితంలో వారెలా స్థిర పడ్డారు, కుటుంబ స్థితిగతులను పంచుకున్నారు. వీరిలో అధికారులు, వైద్యులు, ఇంజినీర్లు, న్యాయవాదులు తదితర రంగాల్లో స్థిరపడిన వారున్నారు.

## నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ


భావన, కమిషనర్, కాకినాడ

కాకినాడ సిటీ: ప్రభుత్వ ఆదేశాల మేరకు సోమవారం ఉదయం 10.30 గంటలకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు నగరపాలక సంస్థ కమిషనర్ భావన తెలిపారు. కాకినాడ నగరంలోని శారదాదేవి ఆలయ సమీపంలోని నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రజల నుంచి నేరుగా సమస్యలపై వినతులు స్వీకరిస్తామన్నారు. అలాగే ఉదయం 9.30 గంటల నుంచి 10.30 గంటల వరకు డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్పొరేషన్ కార్యాలయ ఫోన్ 0884–2357800కు సమస్యలు తెలియజేయవచ్చన్నారు. డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ ద్వారా ప్రజలు తమ సమస్యలను తెలియజేయవచ్చన్నారు. ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తులను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని కమిషనర్ భావన తెలిపారు.

## తైక్వాండో పోటీల్లో కాకినాడ జిల్లా ప్రతిభ


ఓవరాల్ చాంపియన్‌షిప్‌లో తృతీయ స్థానం సాధించిన జిల్లా క్రీడాకారులు

**ఓవరాల్ చాంపియన్‌షిప్‌లో తృతీయ స్థానం**

నాగమల్లితోట జంక్షన్(కాకినాడ సిటీ): విశాఖలో శని, ఆదివారాల్లో జరిగిన రాష్ట్రస్థాయి తైక్వాండో జూనియర్స్, సబ్ జూనియర్స్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు ఓవరాల్ చాంపియన్‌షిప్ తృతీయ స్థానం సాధించారని తైక్వాండో సంఘ కార్యదర్శి బి.అర్జునరావు ఆదివారం తెలిపారు. ఈ పోటీల్లో రెండు బంగారు, 8 రజత, 13 కాంస్య పతకాలను జిల్లా క్రీడాకారులు సొంతం చేసుకున్నారు. మొత్తం 23 పతకాలతో తృతీయ స్థానంలో నిలిచారు. పతకాలు సాధించిన క్రీడాకారులను, శిక్షణ అందించిన కోచ్‌లను జిల్లా ఒలింపిక్ సంఘ అధ్యక్షుడు ద్వారంపూడి వీరభద్రారెడ్డి, కార్యదర్శి జి.ఎలీషాబాబు, డీఎస్‌డీఓ బి.శ్రీనివాస్ కుమార్ అభినందించారు.

## ఘనంగా సోదరీమణుల దినోత్సవం

కాకినాడ రూరల్: అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో సోదరీమణుల దినోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. జిల్లా బాలల సంక్షేమాధికారి సీహెచ్ వెంకట్రావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అక్కాచెల్లెళ్ల అనుబంధంపై ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా పలువురు సోదరీమణులకు నూతన వస్త్రాలను అడబాల రత్నప్రసాద్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రముఖులు డాక్టర్ వెంకటరమణ, న్యాయవాది యనమల రామం, రేలంగి బాపిరాజు, ప్రసాద్ నాయుడు, రామారావు, రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.


సోదరీమణులకు నూతన వస్త్రాలు పంపిణీ చేస్తున్న ప్రముఖులు

## ఉచిత కంటి వైద్య శిబిరం


శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఈశ్వర్‌కుమార్

బోట్‌క్లబ్: లయన్స్ క్లబ్ శ్రేయస్ ఆధ్వర్యంలో స్థానిక 36 డివిజన్లో ఆదివారం కిరణ్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు .మాజీ కార్పొరేటర్, క్లబ్ అధ్యక్షురాలు సాలగ్రామ లక్ష్మీప్రసన్న ఆధ్వర్యంలో జరిగిన ఈ వైద్య శిబిరాన్ని లయన్స్ క్లబ్ గవర్నర్ ఈశ్వరకుమార్ ప్రారంభించారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా, పర్యావరణ పరిరక్షణ కోసం 15 రోజుల పాటు మొక్కలు నాటాలని కోరారు. ఈ శిబిరంలో 250 మందికి పరీక్షలు నిర్వహించగా, 75 మందికి కంటి ఆపరేషన్లు అవసరమని గుర్తించినట్టు లక్ష్మీప్రసన్న తెలిపారు. వారికి త్వరలోనే క్లబ్ ఆధ్వర్యంలో ఉచితంగా ఆపరేషన్లు చేయిస్తామన్నారు. కార్యక్రమంలో క్లబ్ మాజీ గవర్నర్లు బాదం బాలకృష్ణ, లింగమల్లు కృష్ణమూర్తి, క్లబ్ సెక్రటరీ విమల, సభ్యులు కోమల జట్ల కుమారి పాల్గొన్నారు.

## దళితుడిపై దాడి చేసిన వారిని శిక్షించాలి

కాకినాడ సిటీ: సామర్లకోట మండలం పెదబ్రహ్మదేవం గ్రామానికి చెందిన దళిత యువకుడు చాప అజయకుమార్‌ను తాళ్లతో కట్టి, హింసించి, తీవ్రంగా కొట్టిన వారిని కఠినంగా శిక్షించాలని సామాజిక న్యాయ సాధన సమితి నాయకులు డిమాండ్ చేశారు. నాయకులు డాక్టర్ పవన్‌కుమార్, డాక్టర్ భానుమతి, టి.నూకరాజు ఆదివారం కాకినాడ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అజయ్‌కుమార్‌ను పరామర్శించారు. ఆయన కుటుంబానికి అండగా ఉంటామని, దోషులను కఠినంగా శిక్షించాలని ఉన్నతాధికారులను కోరతామన్నారు. దళిత యువకుడిపై దాడి చేయడం దారుణమన్నారు. ఈ ఘటనలో నిందితులైన వారిని వెంటనే అరెస్టు చేసి, శిక్షించాలన్నారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు.

# ఉద్యానం.. అధ్వానం..


బురదమయంగా మారిన వాకింగ్ ట్రాక్


పార్కులో పేరుకున్న చెత్తాచెదారం

- మురుగుతో నిండిన వాకింగ్ ట్రాక్
- ఎటుచూసినా చెత్తాచెదారం
- ఇదీ బోట్‌క్లబ్ ఉద్యానవనం దుస్థితి


అపాయకరంగా ఫ్యూజ్ బాక్సు

బోట్‌క్లబ్: కాసేపు కుటుంబంతో సేదతీరాలని బోట్ క్లబ్ పార్కు వచ్చిన వారికి కొద్ది క్షణాలు కూడా నిలబడలేని దుస్థితి. పార్కు నిర్వహణలో అధికారులు, సిబ్బంది చూపుతున్న నిర్లక్ష్య వైఖరి సందర్శకుల పాలిట శాపంగా పరిణమించింది. స్థానిక ఒకటో డివిజన్‌లోని పిఠాపురం రోడ్డు పక్కనున్న బోట్‌క్లబ్ ఉద్యానవనం సమస్యలతో సతమతమవుతోంది. ఇటీవల పార్కులో ఏడాకుల చెట్లు, కానోకార్పస్ చెట్లు తొలగించారు. ఆ చెట్లను, వాటి ఆకులు కూడా పూర్తి స్థాయిలో తరలించుకుపోవడంతో పార్కు మరీ అధ్వానంగా తయారైంది.

**దర్టీ ట్రాక్**

ఉదయం, సాయంత్రం ఈ పార్కుకు దాదాపు మూడు వేల మందికి సందర్శకులు వస్తుంటారు. ఉదయం, సాయంత్రం వేళల్లో వాకింగ్ చేసేందుకు వచ్చిన వారు ఇక్కడ ట్రాక్ పరిస్థితి చూసి అవాక్కవుతున్నారు. అధ్వానంగా ఉన్న ట్రాక్‌ను విడిచి, పక్కనున్న మార్గంలో వాకింగ్ చేయాల్సిన పరిస్థితి నెలకొంది. నాగేంద్ర స్వామి ఆలయం పక్కన ఉన్న వాకింగ్ ట్రాక్ కొద్దిగా అనుకూలంగా ఉన్నప్పటికీ, పిఠాపురం రోడ్డువైపు ఉన్న ట్రాక్ మాత్రం నడకకు పనికి రాకుండా పోయింది. ఇటీవల కురిసిన వర్షానికి పూర్తిగా బురదమయంగా మారింది. నడిచేందుకు కూడా అనువుగా లేదు. వాకర్లు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. గతంలో వర్షం వస్తే ఒక్క రోజు మాత్రమే ఇబ్బంది ఉండేదని, ప్రస్తుతం వర్షం వస్తే కొన్ని రోజుల పాటు వాకింగ్‌కు వీల్లేకుండా పోతోందని వాకర్లు వాపోతున్నారు.

**కమిషనర్ వస్తేనే..**

ఇటీవల పార్కుకు కమిషనర్ వచ్చి పరిశీలించడంతో అప్పటిలో అధికారులు హడావిడి చేసి పార్కును అందంగా తయారుచేశారు. కొన్ని రోజులు కాస్త అందంగా ఉన్న పార్కు, మూడు వారాలుగా అధ్వానంగా తయారైంది. పార్కులో ఇటీవల కూలేందుకు సిద్ధంగా ఉన్న భారీ వృక్షాన్ని పడగొట్టి, వాటి కొమ్మలు అక్కడే వదిలేశారు. దీంతో ఆయా ప్రాంతంలో సందర్శకులు కూర్చునేందుకు వీలులేకుండా పోయింది.

**రోజుల తరబడి ఇలా..**

పార్కులో ఏ మూల చూసినా చెత్తాచెదారం పేరుకుపోయింది. సుమారు మూడు వారాలుగా పార్కు శుభ్రం చేయకపోవడంతో దుర్వాసన వెదజల్లుతోంది. డస్ట్‌బిన్లలో చెత్తను కూడా తీయకపోవడంతో, అటునుంచి వెళ్లేందుకు కూడా సందర్శకులు సాహసించలేక పోతున్నారు. పార్కులో ఎటుచూసినా తినుబండరాల కవర్లు దర్శనమిస్తున్నాయి.

**చీకటి పడితే అంధకారమే..**

పార్కులో పదికి పైగా విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి. దీంతో అక్కడ అంధకారం నెలకొంది. చీకటిపడ్డాక వాకింగ్, పార్కుకు వచ్చే సందర్శకులు భయాందోళన చెందుతున్నారు. ఎప్పుడు విష పురుగులు కాలి కిందకు వస్తాయోనని భీతిల్లుతున్నారు. చెత్తాచెదారం కారణంగా పార్కు విష జీవులకు ఆవాసంగా మారింది. కొన్నిచోట్ల అసలు విద్యుద్దీపాలే లేవు. చీకటిపడ్డాక కొందరు మందు బాబులు ఈ ప్రాంతాలను తమ అడ్డాలుగా మార్చుకుంటున్నారు. జులాయిలు గుంపులు చేరుతున్నారు. తాగిన మద్యం బాటిళ్లను అక్కడే విచ్చలవిడిగా పారేస్తున్నారు.

**పాడైనా పట్టించుకోరా?**

నాలుగేళ్ల క్రితం పార్కులో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్ పరికరాలు ప్రస్తుతం మరమ్మతులకు చేరుకున్నాయి. అధికారులు వాటిని పట్టించుకోవడం లేదు. దీంతో అవి నిరుపయోగంగా మారాయి. బోట్‌క్లబ్‌కు రెండువైపులా 20కి పైగా వ్యాయామ పరికరాలున్నాయి. వీటిలో ఆరు వినియోగించేందుకు వీల్లేకుండా ఉన్నాయి. స్వల్ప మరమ్మతులు కూడా చేయకపోవడంతో అవి మూలన పడ్డాయి.

**రక్షణ లేని ఫ్యూజు బాక్సులు**

పార్కులో సుమారు 50కి పైగా విద్యుత్ స్తంభాలు ఉన్నాయి. వీటి ఫ్యూజ్ బాక్కులు చేతికందే ఎత్తులో ఏర్పాటు చేశారు. వీటి డోర్లు పాడవ్వడంతో వాటికి మరమ్మతులు కూడా చేయకుండా వదిలేశారు. దీంతో పార్కుకు వచ్చే చిన్న పిల్లలు ఎక్కడ వాటిని పట్టుకుంటారోనని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. పార్కులో 30కి పైగా విద్యుత్ స్తంభాలకు ఫ్యూజ్ బాక్సుల డోర్లు పాడయ్యాయి.


**నడకకూ అనువుగా లేదు**



వాకింగ్ చేసేందుకు అనువుగా ఉంటుందని ఎప్పట్నుంచో బోట్‌క్లబ్ పార్కుకు వస్తుంటాను. ప్రస్తుతం ఇక్కడ వాకింగ్ చేయడానికి అంత అనువుగా లేదు. వాకింగ్ ట్రాక్ పూర్తిగా బురదమయంగా మారింది. ట్రాక్‌పై వర్షపు నీరు పోయేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– ఎస్ సుబ్రహ్మణ్యం, వాకర్

**నిత్యం చెత్తను తరలించాలి**



పార్కులో పచ్చగడ్డిపై కూర్చుందామంటే అక్కడ చెత్తాచెదారం ఉంటోంది. తిని పడేసిన ప్లేట్లు ఉంటున్నాయి. అవి దుర్వాసన వెదజల్లుతున్నాయి. రోజూ చెత్తాచెదారం తొలగించే ఏర్పాట్లు చేయాలి. చెత్త పేరుకుపోవడం వల్ల పార్కు చాలా అధ్వానంగా మారింది.

– గున్నాబత్తుల స్వామి, వాకర్